గంగమ్మ జాతరలో ఎంఎల్ఎ, మేయర్, కమిషనర్ సరదాగా...

వైభవంగా తిరుపతి గంగజాతర

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతర అట్టహాసంగా జరిగింది. అయితే లక్షలాది రూపాయలు విరాళాలు వచ్చినా భక్తులు పొంగళ్లు వండుకునేందుకు కనీస సౌకర్యాలు లేవన్న విమర్శలూ లేకపోలేదు. తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలోనూ, పెద్దపెద్ద సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, పొంగళ్లు, అన్నదాన కార్యక్రమాలు విరివిగా జరిగాయి. గుడి ప్రాంగణం కోళ్లు, పొటేళ్ల బలితో రక్తం ఏరులై పారింది. జంతుబలి అధికార యంత్రాంగం సాక్షిగానే జరిగింది. బుధవారం తెల్లవారుజామున గంగమ్మ 'చెంప నరికే' కార్యక్రమం వద్ద మన్ను కోసం భక్తుల తొక్కిసలాట చోటు చేసుకుంది. ఏదిఏమైనా రాష్ట్ర పండుగగా తిరుపతి గంగమ్మ జాతరను ప్రకటించినా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతరగానే ముగింసిందన్న విమర్శలూ లేకపోలేదు.

తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం వేకువజామునుంచే భక్తులు తరలివచ్చారు. పొంగళ్లు పెట్టి మొక్కు తీర్చుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుపతి ఇందిరా ప్రియదర్శిని మార్కెట్ వద్ద పొంగళ్లు పెట్టుకోడానికి ప్రత్యేక వసతి కల్పించారు. అయితే మండుటెండలోనే భక్తులు పొంగళ్లు పెట్టాల్సి వచ్చింది. వారం రోజుల పాటు భక్తులు వివిధ వేషధారణతో కనిపించారు. మంగళవారం పేరంటాళ్ల వేషంతో పురుషులు ఆడవారి వేషాలు వేసి దర్శించుకున్నారు. ఉదయం 10 గంటల వరకు భక్తులతో కిక్కిరిసిన ఆలయం, ఆపైన మధ్యాహ్నం మూడు గంటల వరకూ భక్తుల రద్దీ కొంత తగ్గింది. జాతర సందర్భంగా విఐపిల తాకిడి ఎక్కువగా కనిపించింది. ఉచితంగా మజ్జిగ, అంబిలి, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి దాదాపు 200 పైగా పొటేళ్లు కోసి భక్తులకు ఉచిత అన్నదానం చేశారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడమే గాకుండా, ట్రాఫిక్‌ను మళ్లించారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో ఉచితంగా తాగునీటి ఏర్పాటు చేశారు. జంతుబలి వద్ద పారిశుధ్య కార్మికులు పరిశుభ్ర చర్యలు చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున 1.30 గంటలకు అమ్మవారి విశ్వరూప దర్శనం ఘట్టానికి భక్తులు పెద్దసంఖ్యలో వస్తారని, కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరితలు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తూ బుర్రలు ఊదుతూ ఆనందంగా తిరిగారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈవో మునిక్రిష్ణయ్య పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు లేక భక్తుల ఇక్కట్లు
'చెంప నరకడంతో' ముగిసిన జాతర

మండుటెండలో పొంగళ్లు పెడుతున్న భక్తులు

వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో...

తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో తుడా ఆఫీస్ కార్నర్ వద్ద మజ్జిగ పంపిణి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలకే తలమానికంగా నిలిచినటువంటి తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగ ప్రకటించడం చాలాసంతోషదాయకమని, జాతరకు వేలాది విచ్చేసిన భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తూ అత్యంత వైభవంగా నిర్వహించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బాలోత్సవ కమిటీ నాయకులు నడ్డి నారాయణ, కడివేటి మునిరత్నం, నెల్లూరు మునిలక్ష్మి టీటీడీ ఉద్యోగ సంఘాల నాయకులు గోల్కొండ వెంకటేష్, కాటా గుణశేఖర్, వివి రమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు బిర్లా నాయుడు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల ప్రధాన కార్యదర్శి ఎం.గంగులప్ప, ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గండికోట నాగవెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమజీవులపై రాజకీయ కక్షసాధింపు చర్యలు వైఎస్ఆర్‌కాంగ్రెస్ హయాంలో ఎక్కువయ్యాయి. తమకు కావాల్సిన వారిని నియమించుకునేందుకు 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికురాలిగా (వంటమ్మ)గా పనిచేస్తున్న వజ్రమ్మను కుట్రపూరితంగా తొలగించారు. తమకు కావాల్సిన వారిని హడావిడిగా నియమించేశారు.. గత 22 రోజులుగా వజ్రమ్మ నిరసన దీక్ష చేస్తూనే ఉన్నా ఉన్నతాధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. గ్రామం బాగోగులపై ప్రశ్నించినందుకే కక్షసాధింపుగా వజ్రమ్మను కావాలనే ఉన్నతాధికారులు తెల్లకాగితంపై సంతకం చేయించుకుని కుట్రపూరితంగా తొలగించారని సిఐటియు శ్రేణులు మండిపడుతున్నాయి. వజ్రమ్మకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగుతుందని వారు హెచ్చరిస్తున్నారు. ఓ దళిత కుటుంబంపై కక్షసాధింపు మంచిది కాదని మండిపడుతున్నారు.

23ఏళ్లుగా పనిచేస్తున్న 'వంటమ్మ'ను తొలగింపు
22 రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టని వైనం
'అధికార' యంత్రాంగం కక్ష సాధింపు చర్యలు

'వజ్రమ్మ' పై కక్ష ఎందుకు..?

ప్రజాశక్తి - ఓజిలి

వజ్రమ్మ వంటమ్మగా పనిచేస్తున్నది రోజులో, వారాలో, నెలలో, ఏడాదో కాదు.. ఏకంగా 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికురాలుగా పనిచేస్తోంది. అయితే ఇన్ని సంవత్సరాలు ఆమె వంటను ఇష్టంగానే విద్యార్థులు తిన్నారు. మరి సడన్‌గా ఆమె భోజనం బాగోలేదని సర్పంచి దగ్గర ఎందుకు లెటర్ తెప్పించుకుని ఉన్నఫళంగా ఉద్యోగం ఊడబెరికారో ఆ ఉన్నతాధికారులకే తెలియాలి. పున్నేపల్లి దళితవాడలో గత 70 ఏళ్ల క్రితం నుండి సర్వే నంబర్ 97లో మైలారి పెంచలయ్య, మైలారి సుబ్రమణ్యంలు నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. గ్రామంలో పలు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు చాలా ఉన్నప్పటికీ వీరి ఇంటి వద్దనే కావాలనే అంగన్‌వాడీ భవనాన్ని ఏర్పాటుకు సిద్ధం చేశారు. ప్రభుత్వ భవనం నిర్మిస్తున్న స్థలంలో దశాబ్దాలుగా గ్రామస్తులంతా శుభకార్యాలకు ఆ స్థలాన్ని వాడుకునేవారు. గ్రామస్తుల శుభకార్యాలకు వాడుకునే స్థలంలో ప్రభుత్వ స్థలం ఏర్పాటు చేస్తే ఎలా? అని వజ్రమ్మ దంపతులు అడ్డుపడ్డారు. దీంతో కక్షసాధింపుగా రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ప్రాథమికోన్నత పాఠశాలలో గత 23 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న వజ్రమ్మను విధుల్లో నుంచి తొలగించేందుకు సర్పంచి ద్వారా వజ్రమ్మ సక్రమంగా పిల్లలకు భోజనం ఏర్పాటు చేయడం లేదని ఫిర్యాదు చేయించారు. ఈ ఫిర్యాదుపై అత్యుత్సాహం చూపిన విద్యాశాఖ అధికారులు వజ్రమ్మతో తెల్లకాగితంపై సంతకాలు చేయించుకుని ఎటువంటి సమాచారం తెలియజేయకుండా ఆమెను అకారణంగా విధుల్లోనుంచి తొలగించారు. సర్పంచి ఫిర్యాదు ఆధారంగా విద్యార్థుల తల్లిదండ్రులతో, విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి విచారణ చేపట్టాల్సిన అధికారులు ఆ కోణంలో దర్యాప్తు చేయకుండానే మైలారి వజ్రమ్మను తొలగించేశారు. అధికార పార్టీకి సానుకూలంగా ఉన్న వారిని విద్యాకమిటీ ద్వారా నియమించేశారు. ఎటువంటి కారణం లేకుండా వజ్రమ్మను అకారణంగా తొలగించడంతో సిఐటియు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో గత 22 రోజులుగా మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట వజ్రమ్మ దీక్ష చేస్తూనే ఉంది. వజ్రమ్మను విధుల్లోకి తీసుకోవాలని పలు కార్మిక సంఘాల ఆమెకు సంఘీభావం ప్రకటిస్తున్నాయి. శాంతియుతంగా నిరసన చేపడుతున్న తనను రాజకీయ పలుకుబడితో బెదిరింపులకు పాల్పడుతున్నారని వజ్రమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

అకారణంగా విధుల్లోనుంచి తొలగించారు : వజ్రమ్మ, వంటమ్మ

గత 22 సంవత్సరాలుగా మధ్యాహ్నం భోజనం పథకం ప్రారంభం నుండి పున్నేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు రుచికరమైన భోజనం వండి పెడుతున్నాను. నాపై రాజకీయ కక్షకు దిగి లేనిపోని ఆరోపణలు సృష్టించారు. విద్యాశాఖ అధికారిణి నీకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని నమ్మబలికి తెల్ల కాగితంపై సంతకాలు చేయించుకుని అకారణంగా తొలగించారు. ఇది ఎక్కడ అన్యాయమని ప్రశ్నిస్తే నువ్వు రాజీనామా చేసావు కదా అందుకే తొలగించామని తెలియజేస్తున్నారు. నాకు ఉద్యోగ భద్రత కల్పించాలని గత 22 రోజులుగా మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నాను. న్యాయం జరిగేంత వరకూ పోరాడతాను.

రాజకీయ కక్షతో తొలగించారు : ఎస్.ముకుంద, సిఐటియు

వ్యక్తిగత రాజకీయ కక్షలతో ఎటువంటి నోటీసులు జారీ చేయకుండా మైలారి వజ్రమ్మను అకారణంగా తొలగించారు. గత 23 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న వజ్రమ్మ పట్ల ఎటువంటి కారణాలు లేకపోయినా స్థానిక రాజకీయ కారణాలతో తొలగించడం సమంజసం కాదు. దీనిపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయనున్నాం. వజ్రమ్మ విధుల్లోకి తీసుకోకపోతే సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు మరింత ఉధతం చేస్తాం.

మత్స్యభరోసా రూ.364.70 లక్షలు లబ్ధి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వైఎస్ఆర్ మత్స్యకార భరోసా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బాపట్ల జిల్లా నిజాంపట్నం నుంచి మంగళవారం ప్రారంభించారు. సముద్రంపై వేటకు వెళ్లే రాష్ట్రవ్యాప్తంగా 1,23,519 మందికి వేట నిషేధ సమయంలో ఒక్కో కుటుంబానికి 10వేల చొప్పున ఆర్థిక సాయాన్ని 123.52 కోట్లు అందించారు. దీంతోపాటు ఒఎన్‌జిసి సంస్థ పైప్‌లైన్ పనుల కారణంగా జీవనోపాధి కోల్పోయిన కోనసీం, కాకినాడ జిల్లాల్లోని 23,458మత్స్యకార కుటుంబాలకు అందిస్తున్న దాదాపు 107.91 కోట్లు వెరశి 231 కోట్ల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాల్లోకి జమ చేశారు. ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్‌కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్, సంబంధిత అధికారులు, మత్స్యకార లబ్దిదారులతో కలిసి వీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3,647 మంది లబ్దిదారుల ఖాతాలకు 364.70 లక్షలను ఖాతాలకు జమ చేశామన్నారు. కోట మండలంలో 176 మందికి రూ.17.60 లక్షలు, చిల్లకూరు మండలంలో 813 మందికి రూ. 81.30 లక్షలు, వాకాడు మండలంలో 1045 మందికి రూ. 104.5 లక్షలు, తడ మండలంలో 1613 మందికి రూ. 161.30 లక్షలు లబ్ధి చేకూరుతోందని అన్నారు. జిల్లా మత్స్యశాఖాధికారి శ్రీనివాస్ నాయక్, మత్స్యకార ప్రతినిధులు దుగ్గరజపట్నం మహీంద్ర, కోట నాగరాజు, తుప్లిపాలేం వెంకటేశ్వర్లు, చిల్లకూరు పోలయ్య, కిరణ్, మత్స్యశాఖ ఏడి చాంద్ బాషా, కోస్టల్ ఎఫ్డిఓ రెడ్డి నాయక్, ఎఫ్డిఓ వెంకట రమణ, రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.



పెద్ద బోట్లు కొనేందుకు ఎంపి నిధులు

తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గం వాకాడు మండలం తూపిలిపాలెం, దుగరాజపట్నం, జమీన్ కొత్తపాలెం పంచాయితీలకు చెందిన మత్స్యకారులు తిరుపతి లోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ గురుమూర్తిని కలిసారు. ఈ సందర్భంగా వారికి సంబందించిన పలు సమస్యలను ఎంపీ గురుమూర్తికి ఏకరువు పెట్టారు. ప్రధానంగా చేపల వేట విషయంలో తమిళనాడు మత్స్యకారులు స్పీడ్ బోట్లలో వచ్చి మన మత్స్య సంపదను అక్రమంగా చొరబడి దోచుకొంటున్నారని, చిన్న చిన్న పడవలు కలిగిన తాము వారిని నిలువరించడం తమ శక్తికి మించిన పని అవుతుందని అన్నారు. తమ జీవనం ప్రధానంగా చేపల వేటపై ఆధార పడి ఉన్నందువలన ఈ సమస్య పరిష్కారానికి సహకరించాలని ఎంపీని కోరారు. ఈ విషయంపై ఫిషరీస్ కో-ఆపరేటివ్ డెవలప్మెంట్ చైర్మన్ అనిల్ బాబుతో మాట్లాడగా తమిళ మత్స్యకారులను నిలువరించేందుకు రెండు పెద్ద బోట్లని కొనుగోలు చేసేందుకు టెండర్లు పిలవగా కేటాయించిన నిధులు సరిపోవని ఎవరూ ముందుకు రాలేదని తెలిపారు. అందుకు ఎంపీ గురుమూర్తి స్పందిస్తూ అవసరమైన నిధుల్ని ఎంపీ నిధుల నుంచి అందజేస్తామని హామీ ఇచ్చారు. అలాగే తూపిలి పాలెం గ్రామానికి బస్సు సౌకర్యం లేదని తెలుపగా వెంటనే ఎంపీ గురుమూర్తి ఆర్టీసీ రీజినల్ మేనేజర్ తో మాట్లాడి వెను వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా త్వరలోనే బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. తీర ప్రాంత గ్రామాలలో రోడ్లు, మంచి నీటి సౌకర్యం వివరాలను వారినడిగి తెలుసుకున్నారు.

మహిళపై అత్యాచారయత్నం
కామ మాంత్రికుడు సుబ్బయ్య అరెస్టు

క్షుద్ర'నగ్న' పూజలు

ప్రజాశక్తి - రేణిగుంట

కుటుంబ సమస్యలు పరిష్కరిస్తామని, పూజల సమయంలో ఇంట్లో ఎవరూ ఉండరాదని షరతులు విధించి మహిళపై అత్యాచారయత్నానికి ప్రయత్నించిన క్షుద్రపూజ కామ మాంత్రికుడు మాసారపు సుబ్బయ్యను రేణిగుంట పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తికి చెందిన క్షుద్రపూజ మాంత్రికుడు సుబ్బయ్య హేమలతపై అత్యాచారయత్నానికి ప్రయత్నించడంతో ఆమె ఫిర్యాదు మేరకు అరెస్టు చేశామని రేణిగుంట సిఐ సుబ్బారెడ్డి తెలిపారు.

మంగళవారం రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో సీఐ మాట్లాడుతూ రేణిగుంట మండలంలోని కరకంబాడి పంచాయతీ తారక రామనగర్‌లో హేమలత(35), భర్త అంకయ్య నివాసం ఉంటున్నారు. వీరికి వివాహమై ఎనిమిదేళ్లయ్యింది. అయితే హేమలతకు కొద్దిరోజులుగా ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆసుపత్రులకు తిరిగినా సరిగాకపోవడంతో ఎవరైనా చేతబడి చేసి ఉంటారన్న అనుమానంతో శ్రీకాళహస్తికు చెందిన మాసారాపు సుబ్బయ్యను ఆశ్రయించింది. క్షుద్ర పూజ తాంత్రికుడు సుబ్బయ్య బాధితురాలు అనారోగ్య సమస్యను పోగొడతానని మహిళకు నమ్మబలికాడు. హేమలత ఇంట్లో అష్టదిగ్బంధనం చేయాలని, రూ.40 వేలు ఖర్చు అవుతుందని చెప్పాడు. హేమలత తన ఆరోగ్యం కుదుట పడుతోందనే ఆశతో తాంత్రికుడు సుబ్బయ్యతో తాము పేదవారమని, తమ వద్ద అంత డబ్బు లేదని ప్రాధేయ పడింది. దీంతో సుబ్బయ్య ఎలాగైనా వీరిని వదులుకో కూడదని చివరికి రూ.20 వేలుకు ఒప్పుకున్నాడు. అందుకు అడ్వాన్స్‌గా రూ.7,500 ఫోన్ పేలో సుబ్బయ్యకు పంపారు. ఆమె ఇంటికి చేరుకున్న సుబ్బయ్య ఇంటికి నాలుగు మూలల్లో గుంతలు తవ్వి నట్టింట ముగ్గువేసి ఇంట్లో హేమలత మాత్రమే ఉండాలని ముందుగానే హెచ్చరించాడు. పూజలో నగ్నంగా కూర్చోమని చెప్పి ఆమె నోట్లో నిమ్మకాయ పెట్టి అరవకుండా చేసి పైన చేయి వేసి బలవంతం చేయబోయాడు. ఈ తోపులాటలో హేమలత చేయి, వీపు భాగాలపై తాంత్రికుడు చేతి గోళ్ల గాట్లు ఏర్పడ్డాయి. దీంతో ఒక్కసారిగా తాంత్రికుడి చేష్టలకు నిర్ఘాంతపోయిన ఆమెను నిమ్మకాయ కోసే కత్తితో చంపేస్తానని కత్తి ఎత్తుకోవడంతో బాధితురాలు హేమలత భయపడి కేకలు వేయడంతో కాలనీలోని చుట్టుపక్కల వారు రావడంతో తాంత్రికుడు సుబ్బయ్య అసలు బండారం బయటపడింది. స్థానికులు సుబ్బయ్యకు దేహశుద్ధి చేసి 100 కు డయల్ చేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునేలోపే సుబ్బయ్య కారులో పరారయ్యాడు. హేమలత ఫిర్యాదు మేరకు రేణిగుంట డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ ఈశ్వరయ్య తమ సిబ్బందితో కలిసి పరారీలో ఉన్న సుబ్బయ్యను రేణిగుంట రమణ విలాస్ సర్కిల్ వద్ద అరెస్టు చేశారు. మాసారపు సుబ్బయ్యపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని సీఐ సుబ్బారెడ్డి తెలిపారు.

సరదాగా భూపతీశ్వర కోనకు వచ్చి...

ముగ్గురు యువకులు దుర్మరణం

ప్రజాశక్తి - నాగలాపురం

తిరుపతి జిల్లా నాగలాపురం మండలంలో బీరకుప్పం గ్రామ సమీపాన ఉన్న భూపతీశ్వర కోన అటవీ ప్రాంతానికి సరదాగా గడిపేందుకు ఐదుగురు స్నేహితులు వచ్చారు.వీరిలో చెన్నైకి చెందిన ముగ్గురు యువకులు నీట మునిగి మతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై హనుమంతప్ప వివరాల మేరకు... చెన్నైకి చెందిన ఐదుగురు యువకులు ఆహ్లాదం కోసం భూపతీశ్వర జలపాతానికి వచ్చారు. వీరిలో మాధవన్ (26), నవీన్ (22), కార్తీక్ ప్రసాద్ (29)లు నీటిలో దూకారు. ఎంతసేపటికి పైకి రాకపోవడంతో తోటి స్నేహితుడు మహేష్, మెరీనా ఇద్దరూ హైదరాబాద్ కంట్రోల్ రూమ్ 100కు ఫోన్ చేశారు. నాగలాపురం పోలీసు స్టేషన్‌కు లొకేషన్ చాట్ చేశాడు. సిఐ శివకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సమాచారం అందుకున్న నాగలాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులతోపాటు ఫైర్ ఇంజిన్ సిబ్బంది. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా కొంతసేపటికే ముగ్గురి మతదేహాలు లభ్యమయ్యాయి. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించి, తోటి స్నేహితులు మహేష్, మెరీనా ఇచ్చిన సమాచారంతో ఎస్సై హనుమంతప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మతులు ముగ్గురు చెన్నై వాస్తవ్యులు. నవీన్, మాధవన్‌లు ఎల్ఎల్‌బి చేశారు. కార్తీక్ ప్రసాద్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. మహేష్, మెరీనాలు ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం నాగలాపురానికి వాహనంలో వచ్చిన వీరు బీరకుప్పం సమీపంలోని భూపతీశ్వర కోనకు అటవీ ప్రాంతం లోపలికి ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లారు. స్నేహితులంతా సంతోషంగా గడుపుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

మృతదేహాలను వొడ్డుపైకి తెచ్చి...

పిల్లల్ని బడికి పంపితే మంచి భవిష్యత్

గిరిజన కాలనీల్లో టీచర్లు ప్రచారం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని విద్యాసంస్కరణలు తెచ్చినా, బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని చెప్పినా గిరిజన కాలనీ పిల్లలు మాత్రం అడవుల్లోనే ఉంటున్నారన్నది వాస్తవం. ఈ నేపథ్యంలో కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో మధ్యలోనే బడి నిలిపేసిన విద్యార్థులను బడికి రప్పించేందుకు ఉపాధ్యాయులు మంచి ప్రయత్నం చేశారు. కల్లివెట్టు ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, గణిత ఉపాధ్యాయులు సురేష్‌బాబు పాఠశాల పరిధిలోని గాంధీ గిరిజన కాలనీ, మొక్కలచేను గిరిజన గ్రామాలను సందర్శించారు. పిల్లలను బడి నిలపకుండా పాఠశాలకు క్రమం తప్పకుండా పంపాలని చదువు విలువను తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య మాట్లాడుతూ డ్రాపౌట్లు ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో ఉన్నారని, అందుకే మూడు రోజులుగా పదో తరగతి పరీక్షల ఫలితాలతో కరపత్రాలను ముద్రించి ఈ గ్రామాల్లో అవగామన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గిరిజన గూడాల్లో ప్రభుత్వ టీచర్ల ప్రచారం

టీటీడీ జూనియర్ కళాశాలల్లో ...
17 నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-క్యాంపస్

తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల, శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి ఆన్లైన్ లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కర్ రెడ్డి తెలిపారు. మే 17 నుంచి జూన్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.విద్యార్థులు 'అడ్మిషన్ తిరుమల.ఆర్గ్' వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసిన వెంటనే "స్టూడెంట్ మాన్యువల్ ఇన్ ఇంగ్లీషు" లేదా "స్టూడెంట్ మాన్యువల్ ఇన్ తెలుగు" రెండు బాక్స్ లు కనిపిస్తాయి. విద్యార్థులు తమకు కావాల్సిన బాక్స్ పైన క్లిక్ చేయాలి. అందులో దరఖాస్తు చేసే విధానాన్ని క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలి. అనంతరం ఇంటర్మీడియేట్ కోర్సుకు జూనియర్ కాలేజీ ని ఎంపిక చేసుకుని క్లిక్ చేయాలి. క్లిక్ చేయగానే స్క్రీన్ పై ఇంగ్లీషు, తెలుగు అనే బాక్స్ లు కనిపిస్తాయి. తమకు కావాల్సిన బాక్స్ పై క్లిక్ చేయగానే టీటీడీ ఆధ్వర్యంలోని రెండు జూనియర్ కళాశాలల్లో ఉన్న గ్రూప్‌లు, వాటిలోని సీట్లు, ప్రవేశానికి అర్హతలు, సీట్ల భర్తీ విధానం, మార్గదర్శకాలు తదితర వివరాలు కనిపిస్తాయని వెల్లడించారు. విద్యార్థులు నమోదు చేసిన వివరాల ప్రకారం గడువు ముగిశాక వారి ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఆయా కళాశాలలో సీటు తాత్కాలికంగా ఆన్‌లైన్‌లో కేటాయించి, విద్యార్థులకు ఎస్ఎమ్ఎస్ పంపుతారు. సీటు పొందిన విద్యార్థి ధవీకరణ పత్రాలను అధికారులు వారి సిస్టమ్‌లోకి అప్‌లోడ్ చేస్తారు. విద్యార్థి ధవీకరణ పత్రాలలోని వివరాలు సరిగాలేకున్నా.. ఆన్‌లైన్‌లో సరిపోల్చకున్నా (టాలీకాకున్న) సీటు రద్దు కావడంతోపాటు సిస్టమ్ నుండి ఆటోమేటిక్‌గా సదరు దరఖాస్తు రద్దు అవుతుందన్నారు. అడ్మిషన్.తిరుమల. ఓఆర్జీ వెబ్ సైట్ ను ఓపెన్ చేయగానే స్క్రీన్‌పై హెల్ప్‌లైన్ నంబర్లు అనే బాక్స్ ఉంటుంది. అక్కడ క్లిక్ చేస్తే సంబంధిత అధ్యాపకుల ఫోన్ నంబర్లు ఉంటాయి. వీటితో ఆయా అంశాలలోని సందేహాలను నివత్తి చేసుకోవచ్చని తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందడానికి వచ్చిన రోగులకు గూడూరు రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ గూడూర్ వెస్ట్ అధ్యక్షులు బండి ధనుంజయరెడ్డి మాట్లాడుతూ ఎండలు ఎక్కువయ్యాయని, ఇలాంటి సమయంలో వివిధ ప్రాంతాల నుంచి నిరుపేదలైన రోగులు గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుంటారన్నారు. వారి సౌకర్యం దష్ట్యా చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రొటీరియన్ మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ఎక్కడ సమస్యలు ఉంటే అక్కడ రోటరీ క్లబ్ ఉంటుందని..గూడూరు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రొటేరియన్స్ శ్రీకంటి రామ్మోహన్‌రావు, సిద్ధారెడ్డి, హరి, హరినాథ్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, బలరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో భజన బృందం

ప్రజాశక్తి-తిరుచానూరు: శ్రీ పద్మావతి అమ్మవారిని మంగళవారం నింద్ర మండలం కావనూరు గ్రామానికి చెందిన శ్రీ పాండురంగ భజన భక్త బందం సభ్యులు దర్శనం చేసుకున్నారు. కావనూరు గ్రామం నుండి తిరుమలకు సుమారుగా 100 కిలోమీటర్లు 32 మందితో భజన బందం పాదయాత్రగా వెళుతోంది. పాదయాత్రలో భాగంగా మార్గమధ్యలో పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. గురువులు కొండయ్య, రమేష్ ఆధ్వర్యంలో కోలాట భజనలు, చిన్నారులు పాడిన పాటలతో అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులను, స్థానికులను మంత్రముగ్ధుల్ని చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన ఏర్పాట్లు చేసిన సూపరింటెండెంట్ మధు, ఏవీఎస్ శైలేంద్ర బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వృద్ధాశ్రమానికి ఫ్రిడ్జ్ వితరణ

ప్రజాశక్తి-గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఓం శ్రీ సాయిరాం వృద్ధాశ్రమానికి ఎలిజబెత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఫ్రిడ్జ్‌ను అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు, జాతీయ మానవ హక్కుల మండలి గూడూరు రూరల్ అధ్యక్షుడు కోటి మాధవరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాదృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. తన కుమార్తె ఎలిజబెత్ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సప్తగిరి బ్యాంకులో కరస్పాండెంట్ల సేవలు..?

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఆవరణలోనే గ్రామీణ కరస్పాండెంట్స్ కొందరు సేవలు అందించడం సర్వ సాధారణంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు సేవలను అందించాలన్న ఉద్దేశంతో సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఉన్నతాధికారులు తమ పరిధిలోనే గ్రామీణ ప్రాంతాలకు కరస్పాండెంట్లను నియమించుకుంది. గ్రామీణ ప్రాంతాల్లోనే పదివేల రూపాయలు వరకు ఖాతాదారులకు ఇవ్వడానికి బ్యాంకు కరెస్పాండెంట్‌తో వెసులుబాటు కల్పించింది. ఈ నేపథ్యంలో చిన్న మొత్తానికి సంబంధించి నగదు డ్రా చేసుకోవడానికి బ్యాంకుల వద్దకు పరుగులు తీసే పని ఖాతాదారులకు తప్పింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించాల్సిన కరస్పాండెంట్లు కొందరు సప్తగిరి బ్యాంకులోనే తిష్ట వేసి బ్యాంకు వద్దకు వచ్చే ఖాతాదారులకు సేవలు అందించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా నగదు డ్రా కోసం బ్యాంకు వద్దకు వచ్చే ఖాతాదారులకు పదివేల రూపాయలు అయితే అక్కడే ఉన్న బ్యాంకు కరస్పాండెంట్ వద్దకు సంబంధిత బ్యాంకు సిబ్బంది పంపడం రివాజుగా మారుతుంది. దీనిపై గ్రామీణ బ్యాంకు అధికారులు వ్యవహరిస్తున్న నిర్వహణ తీరుపై పలువురు ఖాతాదారులు మండిపడుతున్నారు. తాము నగదు కోసం బ్యాంకు వద్దకు వెళ్తే బ్యాంకు సిబ్బంది కరస్పాండెంట్ వద్ద పొమ్మని చెప్పడం విమర్శలకు దారిచేస్తుంది. పైగా గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించాల్సిన కరస్పాండెంట్లు బ్యాంకు లోపల సేవలు అందించేందుకు సంబంధిత సత్యవేడు సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ అనుమతించడంపై సర్వత్రా విమర్శలు వెళ్లువెత్తుతున్నాయి. పైగా బ్యాంకు లోపల గ్రామీణ కరస్పాండెంట్లు సేవలందిస్తే బ్యాంకులో సిబ్బంది ఎందుకని ఖాతాదారులు పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా దీనిపై సప్తగిరి గ్రామీణ బ్యాంకు స్పందించి బ్యాంకు లోపల గ్రామీణ కరస్పాండెంట్ సేవలను నిర్మూలించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కరస్పాండెంట్లు సేవలందించేలా చొరవ చూపాలని పలువురు ఖాతాదారులు కోరుతున్నారు.

స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వేసవి సెలవుల్లో గ్రంథాలయ శాఖలో నిర్వహిస్తున్న వేసవిశిబిరంలో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు గ్రంథాలయ అధికారి మీనా కుమారి పేర్కొన్నారు. మంగళవారం పుత్తూరు గ్రంథాలయ శాఖలో మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించడంతోపాటు వారికి ఆంగ్లంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు శిక్షణ ఇవ్వడానికి ఎవరైనా ముందుకొస్తే 9490394867 నంబరును సంప్రదించాలని కోరారు.

రాయితీపై జనుము పంపిణీ

ప్రజాశక్తి-పిచ్చా టూరు: జనుము, జీలగలు రైతు భరోసా కేంద్రంలో 50 శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయని ఏవో సంజీవిరెడ్డి తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్, 1-బి తో సమీపంలో రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకరంగా ఉంటారని వైద్యాధికారిణి డాక్టర్ శశికళ అన్నారు. మంగళవారం ప్రపంచ డెంగీ దినోత్సవం సందర్భంగా ఆమె ఆధ్వర్యంలో చిన్నగొట్టిగల్లులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పగటిపూట కుట్టే దోమలతో డెంగీ వ్యాప్తి చెందుతుందని తెలిపారు. మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని.. తడి ప్రదేశాలలో బ్లీచింగ్ చల్లాలని.. కొబ్బరి చిప్పలు, టైర్లు, నిరుపయోగ వస్తువులు, ఇంటిపైన, బయట వేయరాదన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని.. ప్రతి శుక్రవారం డ్రై-డేగా పాటించాలని సిబ్బందికి సూచించారు. జ్వరం, అలసట, కీళ్లనొప్పులు, తలనొప్పి, దాహం లక్షణాలు కనపడితే వెంటనే డాక్టర్లు ను కలిసి వైద్యపరీక్షలు చేసుకొని చికిత్స చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శేషుకుమారి, సూపర్‌వైజర్ వసంత కుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో డెంగీ కట్టడి చేయవచ్చని వైద్యాధికారిణి డాక్టర్ గాయత్రి అన్నారు. పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ హమీద్, డాక్టర్ ధనంజయులు, ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దారు మధుసూదన్‌రావు, సామాజిక ఆరోగ్య అధికారి శివయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు శాంతి, వెంకటలక్ష్మమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : దోమల కారణంగా డెంగీ జ్వరాలు వస్తాయని..ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పరమేశ్వరమంగళం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కళ్యాణి తెలిపారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మండలంలోని కేబీఆర్‌పురం సచివాలయం పరిధిలో మంగళవారం డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణి మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణాధికారి రమేష్, ఏఎన్ఎం శారద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యవేడు: దోమకాటుతో డెంగీ వ్యాధి సంక్రమిస్తుందని దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్ అన్నారు. మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ సచివాలయ పరిధిలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దాసుకుప్పం వైద్యులు డాక్టర్ మురళీకష్ణ, సిహెచ్‌ఓ మీరాకుమారి, ఎంపిహెచ్‌ఓ వెంకటరమణ, సూపర్వైజర్ నాగజ్యోతి, ఏఎన్‌ఎంలు ఝాన్సీ, సరస్వతి, ఆశ కార్యకర్త జమున, అంగన్వాడీ కార్యకర్త చంద్రమ్మ, శ్రీధర్ పాల్గొన్నారు.

దొరవారిసత్రం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

31 నుంచి పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు

ప్రజాశక్తి-తిరుచానూరు: శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు ఈనెల 31 నుంచి జూన్ 4వ తేదీ వరకు ఐదురోజుల పాటు ఘనంగా జరుగనున్నాయి. రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారు పద్మసరోవరంలో తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల్లో శ్రీ అలమేలు మంగమ్మ పద్మసరోవర తీరంలో పాంచరాత్ర ఆగమపూజలు అందుకుని భక్తులను అనుగ్రహిస్తారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ఠశుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తిప్పలు, సంసార దుఃఖాలు తొలగి, మోక్షం సిద్ధిస్తుంది. పద్మసరస్సులో బంగారు పద్మం నుండి ఆవిర్భవించిన అలమేలు మంగ జీవకోటికి మాతమూర్తిగా మారి భవజలధిలో మునిగిపోకుండా రక్షించి, సర్వసౌఖ్యాలు ప్రసాదిస్తారని తెప్పోత్సవాల అంతరార్థం.

31వ తేదీ మొదటి రోజు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకష్ణస్వామి, రెండో రోజు శ్రీ సుందరరాజస్వామి, చివరి మూడు రోజులు శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తారు. చివరి మూడు రోజుల పాటు పద్మసరోవరంలోని నీరాడ మండపంలో మధ్యాహ్నం 3.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు అమ్మవారికి స్నపనతిరుమంజనం నిర్వహించనున్నారు. అమ్మవారికి జూన్ 3వ తేదీ రాత్రి 8 గంటలకు గజవాహనం, జూన్ 4వ తేదీ రాత్రి 8 గంటలకు గరుడ వాహనసేవ నిర్వహిస్తారు. తెప్పోత్సవం అనంతరం ప్రతిరోజు ఆలయ మాడ వీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు.

ఆర్జితసేవలు రద్దు: తెప్పోత్సవాల కారణంగా అమ్మవారి ఆలయంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక, భజనలు, కోలాటాలు నిర్వహించనున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి

ప్రజాశక్తి-ఓజిలి: సంక్షేమ పథకాలతో ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని ఇనుగుంట పంచాయతీ పరిధిలో సర్పంచి కొణిదల విజయమ్మ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద మధ్యతరగతి కుటుంబాల అభ్యున్నతికి పాటుపడుతుందని.. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషకరంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు గుంటమడుగు రవీంద్రరాజు, కో ఆప్షన్ మెంబర్ ఖాదర్‌బాషా, గోపాల్ రెడ్డి, ఉచ్చూరు హరనాథ రెడ్డి, దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పాదర్తి హరినాథ్ రెడ్డి, ముమ్మడి సుబ్బారావు యాదవ్, ఫణిందర్ రెడ్డి, పి.వేణురెడ్డి, బి.రాజారెడ్డి, నాగరాజు, సురేష్, కుమార్‌నాయుడు, ప్రభుత్వశాఖ అధికారులు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీలో నలుగురైనా నీతిమంతులున్నారా..?'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పవన్ కళ్యాణ్‌ను చూస్తే ముఖ్యమంత్రి జగన్ కు భయమేస్తోందని, రానున్న ఎన్నికల్లో ఓటమి చెందుతామన్న భయం స్పష్టంగా కనబడుతోందని జనసేన పార్టీ తిరుపతి అసెంబ్లీ ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిరణ్ రాయల్ మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో పరదాల చాటు నుండి పరిపాలన చేస్తూ రాజధాని ఏర్పాటు చేయలేని ముఖ్యమంత్రిగా జగన్ మిగిలిపోయారన్నారు. ఇడుపులపాయలోని వైయస్సార్ సమాధి ప్రాంగణంలో సీఎం జగన్ అవినీతి సొమ్ము దాచి పెట్టారని, అధికారంలోకి రాగానే వాటిని వెలికి తీస్తామన్నారు. తిరుపతి గంగమ్మ జాతరలో ఆలయ పాలకమండలి సభ్యులకే దర్శనాలు కరువయ్యాయని, ప్రతి ఒక్కరూ రూ.300 చెల్లించి అమ్మవారిని దర్శించుకోవాలని నిబంధన సహేతుకం కాదన్నారు. వైసిపి నాయకుల పిచ్చి పరాకాష్టకు చేరి అమ్మవారి ఆలయంలోనే వైసీపీ బ్యానర్లు ఏర్పాటు చేయడం భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని, తాము అధికారంలోకి వస్తే జాతర ఎలా ఉంటుందో నిర్వహించి చూపెడతామన్నారు. జనసేన పట్టణ అధ్యక్షులు రాజారెడ్డి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పర్యటించేది ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాదని, ఎక్కడ ప్రభుత్వ భూములున్నాయి, ఏ స్థలాలు కుటుంబ తగాదాలతో ఉన్నాయో వాటి పంచాయతీలకు తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. 16 నెలలు జైలులో ఉన్న జగన్ కు పత్రికలు, మీడియాపై మాట్లాడే అర్హత లేదన్నారు. వైసిపి పార్టీలో కనీసం నలుగురైన నీతిమంతులు ఉన్నారా అని ప్రశ్నించారు. 2024 ఎన్నికల్లో జగన్ ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సత్యవంతుడు, మునుస్వామి, రాజా మోహన్, సుమన్ రాయల్, మనోజ్, కిషోర్, షేక్ షరీఫ్, వినోద్ రాయల్ పాల్గొన్నారు.

చరిత్రకు సాక్ష్యం.. తాతయ్యగుంట గంగజాతర

సామాజిక , సాంస్కృతిక నేపథ్యం

ప్రజాశక్తి - క్యాంపస్

వ్యవస్థీకరణ పొందిన సంప్రదాయ జీవన విధానం సంస్కృతి అన్నది పరిశోధకుల మాట. ఆ వ్యవస్థీకత జీవన విధానంలో ఒక్కో సమాజం తర తరాలుగా అనుసరించిన మరో తరానికి అందించిన సంప్రదాయమే సంస్కృతి. ఈ నేపథ్యంలోనే సర్వత్ర వ్యాపించి ఉన్న అదశ్యదేవతని ఆహ్వానించి, సంతోషపెట్టి, తిరిగి పంపించే రీతులు పండగలు, జాతరలు, కొలుపులు, తిరణాళ్ళు, ఉత్సవాలు లాంటివి ఉంటాయి. తిరుపతిలో ఏటా చిత్రి నెల నాలుగో మంగళవారం చాటింపు చేసి వారం పాటు వివిధ వేషాలతో, ఆచారాలతో, మొక్కుబడులతో గంగమ్మ జాతర జరుగుతుంది. గంగమ్మ జాతర అంత జాతర, తిరుమల కొండంత కొండ, పేరూరు గుట్ట అంత గుట్ట లేవన్నది స్థానికుల మాట. ఆ గంగజాతర గురించి ముచ్చటించుకోవడమే నేటి మన ముచ్చట. జానపద గిరిజన విజ్ఞాన పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్లు, 2002, 2003 సంవత్సరాల్లో ఆడియో విజువల్ డాక్యుమెంట్ చేసి సేకరించిన వివరాలు దీనికి ఆధారం. ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జాతరగా గుర్తించింది.

తిరుపతిలో పల్లెవీధి గంగమ్మ, మంచాలవీధి గంగమ్మ, తాతయ్యగుంట గంగమ్మ, తాళ్లపాక గంగమ్మ, వేషాలమ్మ గంగమ్మ తల్లి సంకల్పంలో వైవిధ్యం ఉంది. తిరుపతిలో జరిగే జాతర తాతయ్యగుంట, తాళ్లపాక గంగమ్మలకి సంబంధించింది. వేషాలమ్మకు కూడా. 1914 లో చెన్నంబర కనకయ్య రత్నకుమార్ మొదలియార్ తాతయ్యగుంట గంగమ్మకు చిన్న గుడి లాంటి మండపం కట్టి పూజారిగా, తర్వాత ధర్మకర్తగా 1957లో చనిపోయే వరకూ ఉన్నారు. వారి కుటుంబీకులు 1992 వరకూ పూజారులుగా ఉండే వారు. తర్వాత బ్రాహ్మణ పూజారులు వచ్చారు.

శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర చాటింపుకి ఒకనాడు తిరుపతికి అయిదారు కిలో మీటర్ల దూరంలో ఉండిన. నేడు తిరుపతిలో కల్సిపోయిన అవిలాల జాతరకు ప్రత్యక్ష సంబంధం ఉంది, అవిలాల నుంచి ఆడబిడ్డ సాంగ్యం తేవడం అందుకు కారణం. తిరుపతికి పదిహేను కిలో మీటర్ల దూరంలో ఉన్న గాజులమండ్యం అనే మాండవ్యపురంలో చిత్రి నెల రెండో మంగళవారం జాతర జరుగుతుంది. ఆ జాతరకు అవిలాల జాతరకు సంబంధం ఉంది అంటారు. అవిలాలలో ముళ్లపూడి వారి ఇంటి నుంచి పెదరెడ్డి దంపతులు ఆడబిడ్డ సాంగ్యం భార్యాభర్తలు ఇద్దరూ ఒక్కపొద్దు ఉండి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కైకాల వారు తాతయ్యగుంట పూజార్లు, ధర్మకర్తలు, అధికారులతో కల్సి, వాద్యమేళాలతో అవిలాల గ్రామ సరిహద్దు గంగశిల దగ్గరికి వెళ్లి వస్తువులు అక్కడ పెట్టి, మేళంతో పెదరెడ్డి ఇంటికి వెళ్లి వారి ఆతిథ్యం స్వీకరించి, అందరూ కల్సి గంగశిల దగ్గరికి వచ్చి శిలను కడిగి పూజించి, కైకాల వారిని పెదరెడ్డి, పెదరెడ్డిని కైకాల వారు కొత్త బట్టలతో మర్యాదలు చేసి తాము తెచ్చిన పళ్లాలని మార్చుకుంటారు.

జాతరలో అంబళ్లు పోయడం మరో ప్రధాన అంశం. మనకు ఒకనాడు ప్రధాన ఆహారమైన సంగటికి, అంబలికి వాడే వస్తువులు ఒకటే అయినా తయారీలో భేదమున్న విషయం తెల్సిందే. పులియబెట్టి చేస్తేనే అది అంబలి లేకపోతే సంగటి. అంబలి దుత్తలో సన్నగా తరిగిన ఎర్రగడ్డ ముక్కలు, మజ్జిగ పోసి బాగా కల్పి, దుత్తకు వేపాకు తోరణం కట్టి, పూజ గదిలో పూజించి, గంగమ్మ గుడి దగ్గరికి తీసుకుపోయి, అక్కడ ఉన్న అండాల్లో పోస్తారు. ఆ అండాలు కూడా పసుపు పూసి, కుంకుమ బొట్లు పెట్టి, వేపాకు కట్టి ఉంటాయి. ఇది ఒక పవిత్ర కార్యక్రమం. ఇంటి దగ్గర గుడి దగ్గర అంబలి పోయడం, అంబలి తాగడం ఒక తప్పనిసరి ఆచారం.

ఆచరణలో తమ జీవన విధానంలో ఏవయితే చాలా అవసరం అని భావించారో వాటికి పవిత్రత కల్పించి, అవి ఎంత ప్రాధాన్యమయినవో గుర్తు చేయడమే ధ్యేయంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతరని చూస్తే, అందులో వాడుతున్న అంబలి, పానకం, వేపాకు, నాంకొమ్ము లాంటి వస్తుసంస్కృతి ప్రాధాన్యత తెలుస్తుంది. అవి ప్రాధాన్యమయినవి అని అనుకున్నపుడు వాటిని క్రమబద్ధంగా పరిచయం చేయడానికి ఈ జాతరను మిరాశీదారులు జరుపుతున్నారనుకోవచ్చు.

(నాగపట్ల భక్తవత్సలరెడ్డి)

ఎర్రచందనం, నాటు తుపాకీ స్వాధీనం - ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: తలకోన సౌత్ ఫారెస్ట్ బీట్ పరిధిలో 27 ఎర్రచందనం కొయ్యలతోపాటు నాటు తుపాకీ, మోటార్ సైకిల్ , నల్లమందును స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ అధికారులు మంగళవారం తెలిపారు. కర్నూల్ రేంజ్ డీఐజీ సెందిల్ కుమార్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా యర్రావారిపాలెం మండలంలోని తలకోన సౌత్ ఫారెస్ట్ బీట్లో ఇద్దరు వ్యక్తులు అక్రమ రవాణా చేయుటకు సిద్ధంగా ఉంచిన 27 ఎర్రచందనం కొయ్యలతో పాటు ఇద్దరు స్మగ్లర్లు, మోటార్ సైకిల్ ను పట్టుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లు చిన్నగొట్టిగల్లు మండలం మైలవాండ్లపల్లికి చెందిన వక్కల శ్రీనివాసులు (46), తమిళనాడులోని వేలూరు జిల్లాకు చెందిన ఆర్ రూపేష్ (25)లుగా గుర్తించారు. వీరితో పాటు దర్యాప్తులో భాగంగా ఎర్రావారిపాలెం మండలం నెరబైలు పంచాయతీ పులిగోనుపల్లికి చెందిన ఉయ్యాల సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి వద్ద నాటు తుపాకీతోపాటు 100 గ్రాములు నల్లమందు కలిగి ఉండగా స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం కొయ్యల బరువు 415 కిలోలు ఉండగా.. వాటి విలువ సుమారుగా రూ.15 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ ఎస్ఐ బి. మోహన్ నాయక్ తెలిపారు.

పశువైద్యాధికారి గోపీనాథ్ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఎగువవీధి పంచాయతీలో ఉన్న పశు వైద్యశాలలో పశు వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న గోపీనాథ్ అనారోగ్య కారణంతో మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతికి ఎగువవీధి పశు వైద్యశాల సిబ్బంది సంతాపం తెలిపారు. బుధవారం తన స్వగ్రామమైన ఏర్పేడు మండలం మేర్లపాకలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యుత్ షాక్‌కు గురై కార్మికుడి మృతి

ప్రజాశక్తి-తిరుచానూరు: తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలస కార్మికుడు సర్వేశ్ కుమార్ (22) డైరీ వరల్డ్ ఐస్ క్రీమ్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ ఐస్ క్రీమ్ వాహనానికి ప్లగ్ పెడుతుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఆటో లో వైద్యం నిమిత్తం తోటి కార్మికులు రుయా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

తిరుపతి జిల్లా ప్రత్యేకాధికారి శ్యామలరావు

ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: దుర్గసముద్రం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం ప్రిన్సిపల్ సెక్రెటరీ,

తిరుపతి జిల్లా స్పెషల్ ఆఫీసర్ శ్యామలరావు, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ డికే బాలాజీలతో కలసి పరిశీలించారు. గర్భిణులు, చిన్న పిల్లలకు అందిస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. లబ్ధిదారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా గర్భిణులకు అందించిన ఆహారంలో ఉడికించిన కోడిగుడ్డు ఇచ్చారని తెలపడంతో తప్పనిసరిగా మెనూలో ఉన్నవిధంగా మునగాకు, లేకుంటే పాలకూరతో కలిపిన గుడ్డు ఇవ్వాలని అంగన్వాడీ టీచర్ శ్యామలకు సూచించారు. అందుబాటులో ఉన్న రేషన్ సరకులను పరిశీలించారు. పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్ పరిశీలించి స్థానికంగా ఉన్న సర్పంచ్ ప్రసాద్ రెడ్డికి పలు సూచనలు చేశారు. అంగన్వాడీ కేంద్రానికి ఉచితంగా అందించే ప్రయత్నం చేయాలన్నారు. వైయస్సార్ హెల్త్ క్లినిక్ పరిశీలించి మెడికల్ ఆఫీసర్ పద్మజతో మాట్లాడి అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మెడికల్ రికార్డులు పరిశీలించారు. దామినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. తిరుపతి ఆర్డీవో కనక నరసారెడ్డి, డీఎల్‌డీవో ఆదిశేషారెడ్డి, ఎంపీడీవో వెంకటనారాయణ, ఐసిడిఎస్ పిడి జయలక్ష్మి , డీఎంహెచ్‌వో శ్రీహరి, డీఈవో శేఖర్, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ చెన్నయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ విజయ్ కుమార్, పంచాయతీరాజ్ అధికారి శంకర్ నారాయణ పాల్గొన్నారు.

వడమాలపేటలో మోస్తరు వర్షం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలంలోని పలు ప్రాంతాలలో మంగళవారం ఉరుములు, మెరుపులు, భారీ

ఈదురుగాలులతో సుమారుగా 45 నిమిషాలపాటు మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అత్యధికంగా 47 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండటంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. మంగళవారం మధ్యాహ్నం 2.45 నిమిషాల నుంచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి మోస్తరు వర్షం పడటంతో ప్రజలకు ఉపశమనం దొరికింది.

ఇరువర్గాలు ఓ నిర్ణయానికి రాకుంటే 144 సెక్షన్

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరిలోని ఏడో వార్డు కోళ్ల ఫారం సెంటర్‌లో గత కొంతకాలంగా శ్రీరామ మందిరం నిర్మాణ

స్థలం వివాదానికి ఇరువర్గాలు ఒక నిర్ణయానికి రాకపోతే వివాద స్థలంలో ఎవరు రాకుండా 144 సెక్షన్ ఏర్పాటు చేస్తామని వెంకటగిరి తహశీల్దారు పద్మావతి తెలిపారు. సోమవారం కోళ్ల ఫారంలోని స్థానికులు స్పందనలో కలెక్టర్ కి వినతి పత్రం అందజేయడంతో మంగళవారం తహశీల్దారు, మున్సిపల్ కమిషనర్, ఎస్సై స్థల పరిశీలన చేశారు. కౌన్సిలర్ చంద్రశేఖర్ రెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్ చలపతి మురళి తదితరులు పాల్గొన్నారు.